REGD NO : APTEL 16144



జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :
janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 313 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 27-05-2025 | పేజీలు : 5

# నేటి నుంచే మహానాడు పండుగ

- కడపలో మహా సంబరానికి సర్వం సిద్ధం
- మూడ్రోజుల మహానాడు కోసం కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు
- మొదటి రోజు 23 వేల మంది ప్రతినిధులతో సభ
- సంస్థాగత నిర్మాణం, భావి కార్యాచరణపై చర్చ
- రేపు వివిధ తీర్మానాలపై సమాలోచనలు
- ఏపీవి 14, తెలంగాణవి 5, ఉమ్మడి తీర్మానాలు 4
- ఎల్లుండి 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ
- కడప చేరుకున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్
- ఇప్పటికే మంత్రులు, పలువురు నేతల మకాం

**అమరావతి/కడప, మే 26 (జనస్వరం) :** కడప గడపలో తెలుగుదేశం పార్టీ నిర్వహించే పసుపు పండుగకు సర్వం సిద్ధమైంది. కర్నూలు-కడప-చిత్తూరు జాతీయ రహదారిలోని రింగురోడ్డు వద్ద సువిశాలమైన 125 ఎకరాల్లో మంగళవారం నుంచి మూడ్రోజుల పాటు తెలుగుదేశం పార్టీ మహానాడు జరగనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. కడప నగరం ఫ్లెక్సీలు, బ్యానర్లతో పసుపుమయంగా మారింది. సోమవారం రాత్రి సీఎం చంద్రబాబు ప్రత్యేక విమానంలో చేరుకోగా.. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ కుప్పం నుంచి రోడ్డు మార్గాన వచ్చారు. నాలుగు రోజులుగా మంత్రుల బృందం కడపలోనే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. ఏడాది పాలనలో కూటమి సాధించిన విజయాలను చర్చించడంతోపాటు ప్రజాపాలనపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను మహానాడు వేదికగా చర్చించనున్నారు. కడపలో తొలిసారి నిర్వహిస్తున్న ఈ వేడుక ద్వారా రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించే అవకాశముంది. లోకేశ్ యువగళం పాదయాత్ర సమయంలో ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్‌ను సవివరంగా చర్చించనున్నారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు ప్రతినిధుల నమోదు కార్యక్రమంతో మహానాడు ప్రారంభమవుతుంది. జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతో ఇది మొదలవుతుంది. ఉదయం 10.30కు ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారు. 10.30-10.45 వరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తారు. 10.45 నుంచి 11 గంటల వరకు పార్టీ అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు ఇతర ముఖ్య నాయకులను వేదికపైకి ఆహ్వానించి పార్టీ జెండా ఆవిష్కరిస్తారు. జ్యోతిప్రజ్వలన, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి, తెలుగు తల్లి గీతాలాపన జరుగుతాయి. 11.10 నుంచి 11.20 వరకు మరణించిన కార్యకర్తలకు సంతాపం.. 11.20 నుంచి 11.30 వరకు జాతీయ ప్రధాన కార్యదర్శి నివేదిక, 11.30 నుంచి 11.45 వరకు రాష్ట్ర అధ్యక్షుడి ప్రసంగం ఉంటాయి. 23 వేల మంది పార్టీ ప్రతినిధుల సభలో సంస్థాగత నిర్మాణం, విధివిధానాలు, సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై కేడర్‌కు నేతలు దిశానిర్దేశం చేయనున్నారు. రెండో రోజు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన తీర్మానాలపై చర్చిస్తారు. మాజీ మంత్రి యనమల కన్వీనర్‌గా ఉన్న మహానాడు తీర్మానాల కమిటీ కసరత్తు పూర్తి చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 14 తీర్మానాలు ప్రతిపాదిస్తారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి సంబంధించి ఐదు తీర్మానాలపైన, ఉమ్మడిగా నాలుగు తీర్మానాలపైన చర్చించి ఆమోదిస్తారు. అవసరాన్ని బట్టి తీర్మానాల సంఖ్య పెరిగే అవకాశముందని టీడీపీ వర్గాలు తెలిపాయి. చివరి రోజు గురువారం 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు.

**గతానికి భిన్నంగా కడపలో.. :**

కడపలో నిర్వహించే మహానాడును టీడీపీ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మాజీ సీఎం జగన్ జిల్లా కావడం, సీమలో గతంలో ఎన్నడూ లేని విధంగా 45 అసెంబ్లీ స్థానాలను కూటమి గెలుచుకోవడం, అన్నిటినీ మించి ఉమ్మడి కడప జిల్లాలో ఏడు స్థానాల్లో టీడీపీ కూటమి విజయంతో.. గతానికి భిన్నంగా ఈసారి కడపలో మహానాడు జరపాలని నిర్ణయించారు. ఏర్పాట్లకు వర్షం అడ్డంకిగా మారినా 19 కమిటీలు వేసుకుని పనులను యుద్ధ ప్రాతిపదికన చకచకా చే సేశారు. గత మహానాడుల కన్నా మించి ఇక్కడ ఏర్పాట్లు చేయడం గమనార్హం. అతిథులకు సీమ వంటకాలతో విందు ఇస్తారు. 450 మంది కూర్చునే విధంగా వేదికను రూపొందించారు. పక్కనే సీఎంవో క్యాంపు ఆఫీసు, రక్తదాన శిబిరం, ఫొటో ఎగ్జిబిషన్, డైనింగ్, మీడియా పాయింట్, సమీపంలోనే 300 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. సోమవారం వర్షంతో ఏర్పాట్లకు అడ్డంకులు ఏర్పడ్డాయి.

**మంత్రుల బృందం బిజీబిజీ :**

మహానాడు ఏర్పాట్లపై మంత్రుల బృందం సమీక్ష నిర్వహించింది. బహిరంగ సభకు జన సమీకరణపై మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నారాయణ, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అమరనాథ్‌రెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, ఆరిమిల్లి రాధాకృష్ణ, చింతమనేని ప్రభాకర్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తదితర నేతలు కడప ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మహానాడులో క్లీనింగ్, బ్యూటిఫికేషన్ కార్యక్రమాలను మంత్రి వాసంశెట్టి సుభాశ్ పరిశీలించారు. స్వచ్ఛ మహానాడు కార్యక్రమానికి డ్రెస్‌కోడ్ జాకెట్లు ధరించాలన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు, నిమ్మల, స్వచ్ఛాంధ్ర చైర్మన్ పట్టాభిరాం, బీసీ కార్పొరేషన్ చైర్మన్ సత్యబాబు, పద్మరాజు ఈ కమిటీలో ఉన్నారు. భోజన వసతులపై మంత్రులు అనిత, అనగాని, సవిత, సంధ్యారాణి సమీక్ష నిర్వహించారు. కాగా మహానాడు బందోబస్తులో 5 వేల మంది పాల్గొంటున్నారు.

**చంద్రబాబు, లోకేశ్‌లకు స్వాగతం :**

చంద్రబాబు రాత్రి 7.35 గంటలకు కడప ఎయిర్‌పోర్టులో దిగారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, కలెక్టర్, ఎస్పీ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన 8 గంటలకు మహానాడు వేదిక వద్దకు చేరుకున్నారు. వేదిక వద్ద మంత్రులు అనగాని, సవిత, నిమ్మల, ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యరెడ్డి, పులివర్తి నాని తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. మహానాడు ఏర్పాట్లపై చంద్రబాబు సమీక్షించారు. జిల్లా పేరును వైఎస్ఆర్ కడపగా మార్చడంతో టీడీపీ నేతలు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. లోకేశ్ కుప్పం నుంచి రోడ్డు మార్గాన రాత్రి 8.50 గంటలకు మహానాడు ప్రాంగణానికి చేరుకున్నారు. టీడీపీ నేతలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ శ్రేణులతో ఉమ్మడి కడప జిల్లాలో ఉన్న హొటళ్లు, ప్రైవేటు ఫంక్షన్ హాళ్లు, ప్రైవేటు విద్యా సంస్థలన్నీ కిటకిటలాడుతున్నాయి. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే వారితో కడప విమానాశ్రయం కూడా విమానాలతో బిజీ కానుంది. ఇక పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు సోమవారం కడపకు వచ్చి మహానాడు వేదిక వద్ద లోకేశ్‌ను కలిశారు.

**ప్రతి మహానాడులో పాల్గొన్నా : మంత్రి ఎన్ఎండీ ఫరూక్**

ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చా. ఇప్పటి వరకు నిర్వహించిన ప్రతి మహానాడుకూ హాజరయ్యాను. తెలుగుగంగ, గాలేరు-నగరి, గండికోట సాగునీటి ప్రాజెక్టులన్నీ ఎన్టీఆర్ హయాంలో మొదలయ్యాయి. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఆ ప్రాజెక్టులను కొనసాగించడంతో పాటు దూరదృష్టితో ఐటీ కంపెనీలు తీసుకొచ్చారు. ఇప్పుడు టీడీపీలోకి రాబోయే కాలానికి కొత్తతరం నేతలు రావాలి. యువకుడు లోకేశ్ ఆధ్వర్యంలో యువతరం రాజకీయాల్లోకి అడుగు పెట్టాలి.

**ఏపీ తీర్మానాలివీ..**

1. ఎన్డీయే ప్రభుత్వం తొలి ఏడాది ఘనవిజయాలు.
2. శరవేగంగా ప్రాజెక్టుల నిర్మాణం(నదుల అనుసంధానం, బనకచర్లకు గోదావరి జలాలు)
3. ఒకే రాజధాని అమరావతి, అభివృద్ధి వికేంద్రీకరణ. (ప్రజారాజధాని నిర్మాణం. పట్టణ, గ్రామీణాభివృద్ధి, పెట్టుబడులతో వికేంద్రీకరణ. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు. జగన్ పాలనలో దోపిడీకి గురైన ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధిపై దృష్టి)
4. విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు.
5. మహిళ, యువత సంక్షేమానికి పెద్దపీట.
6. సాంకేతిక పరిజ్ఞానంతో లాభసాటి వ్యవసాయం.
7. కట్టుదిట్టంగా శాంతిభద్రతలు.
8. చంద్రన్న విజన్‌తో సంక్షేమ రాజ్యం. అన్ని వర్గాలకు ప్రాధాన్యం.
9. మౌలిక సదుపాయాల అభివృద్ధి, కేంద్రం తోడ్పాటు.
10. పేదరికం లేని సమాజ నిర్మాణ సంకల్పంతో 'పీ-4'.
11. సాకారమైన విజన్ 2020.. విజన్-2047 సాధనకు అడుగులు.
12. విద్యుత్ రంగంలో విప్లవాత్మక విజయాలు.
13. విపక్ష నేతగా విఫలమైన జగన్.
14. సహజ వనరుల పరిరక్షణ, అక్రమార్కులపై చర్యలు.

**ఉమ్మడి తీర్మానాలు**

1. తెలుగువారి చరిత్రలో ఎన్టీఆర్ ప్రత్యేకత.
2. తెలుగువారి చరిత్రలో చంద్రన్న మైలురాళ్లు/ముద్ర.
3. అమరులైన టీడీపీ కార్యకర్తలు, నాయకులకు ఘన నివాళి.
4. కార్యకర్తల సంక్షేమం.

# సీమలో ప్రవేశం.. కావలి వరకూ విస్తరణ

**విశాఖపట్నం/అమరావతి, మే 26 (జనస్వరం) :** నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఈ నెల 13న అండమాన్‌కు వచ్చిన రుతుపవనాలు 24న కేరళను తాకాయి. అనూహ్యంగా సోమవారమే రాయలసీమ ప్రాంతంలోకి ప్రవేశించాయి. వాతావరణ శాఖ అంచనాలకు భిన్నంగా 10 రోజుల ముందే తొలకరి పలకరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం రుతుపవనాలు సీమలో ఎక్కువ ప్రాంతాలు, దక్షిణ కోస్తాలో కావలి వరకూ విస్తరించాయి. సాధారణంగా జూన్ ఐదో తేదీ నాటికి రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో రుతుపవనాలు ప్రవేశించాల్సి ఉంది. అయితే ఈ ఏడాది అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో అనుకూల వాతావరణం నెలకొనడంతో పది రోజుల ముందుగానే వచ్చాయి. గత ఏడాది జూన్ రెండో తేదీన రాయలసీమ, దక్షిణ కోస్తాల్లోకి రుతుపవనాలు ప్రవేశించాయి. సోమవారం అరేబియా సముద్రంలో అనేక ప్రాంతాలు, కర్ణాటకలో బెంగళూరు, మహారాష్ట్రలో ముంబై వరకూ, తమిళనాడులో మిగిలిన భాగం, తెలంగాణలో కొద్ది ప్రాంతం, బంగాళాఖాతంలో అనేక ప్రాంతాలు, ఈశాన్య భారతంలో త్రిపుర, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, మేఘాలయలో పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయి. రానున్న మూడు రోజుల్లో అరేబియా సముద్రం, కర్ణాటకలో మిగిలిన ప్రాంతం, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీలో కొన్ని ప్రాంతాలు, బంగాళాఖాతం, ఈశాన్య భారతంలో మిగిలిన ప్రాంతాలు, పశ్చిమ బెంగాల్ వరకూ



రుతుపవనాలు విస్తరిస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. సాధారణంగా మే చివరి వారంలో రోహిణి కార్తె ప్రారంభమై జూన్ తొలివారం వరకూ కొనసాగుతుంది. ఆ సమయంలో గాడ్పుల ప్రభావం, వర్షాలు లేకపోవడంతో పంటలపై ప్రభావం చూపిన సందర్భాలున్నాయి. రుతుపవనాలు ఆలస్యమైతే మెట్ట పంటల సాగు, వరి నారుమడులు పోసుకోవడంలో జాప్యం, మరోవైపు వడగాడ్పుల తీవ్రత కొనసాగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారు. ఈ ఏడాది అందుకు భిన్నంగా మే లో రాష్ట్రంలో రోజు ఎక్కడో ఒకచోట వర్షం కురుస్తుండడం, చివరి వారం రుతుపవనాలు రావడంతో ఖరీఫ్ పంటలు వేగంగా సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడిందని వాతావరణ నిపుణులు వ్యాఖ్యానించారు.


**రానున్న మూడు రోజులూ వర్షాలే :**

మధ్య మహారాష్ట్ర, కర్ణాటక పరిసరాల్లో భూ ఉపరితలంపై ఉన్న తీవ్ర అల్పపీడనం సోమవారానికి అల్పపీడనంగా బలహీనపడి మరట్వాడా పరిసరాల్లో కొనసాగుతోంది. ఇది మరింత బలహీనపడి ఉపరితల ఆవర్తనంగా మారి తెలంగాణ, కోస్తాంధ్ర మీదుగా పశ్చిమ బంగాళాఖాతంలో ప్రవేశించనుంది. దీని ప్రభావంతో మంగళ లేదా బుధవారం పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. అది ఒడిశా తీరానికి ఆనుకుని ఉత్తర వాయువ్యంగా తర్వాత ఉత్తరంగా పయనిస్తుందని, ఈ ప్రభావంతో రుతుపవనాలు ఉత్తర కోస్తా, ఒడిశా మీదుగా తూర్పు భారతం వరకూ విస్తరించనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇంకా తూర్పు మధ్య అరేబియా సముద్రం నుంచి కొంకణ్, మరట్వాడా, తెలంగాణ మీదుగా కోస్తాంధ్ర వరకూ ఉపరితల ద్రోణి విస్తరించింది. రుతుపవనాలు, ద్రోణి ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో ఎక్కువచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న మూడు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. తెలిపింది. కోస్తా తీరం వెంబడి 50-60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

**ముందుగానే నైరుతి శుభపరిణామం.. ఎక్స్‌లో సీఎం చంద్రబాబు**

నైరుతి రుతుపవనాలు ముందుగానే రాష్ట్రంలోకి ప్రవేశించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని సీఎం చంద్రబాబు సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'చాలా ఏళ్ల తర్వాత మే నెలలోనే రాష్ట్రానికి నైరుతి పలకరింపు శుభ పరిణామం. రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ అంచనాలు నిజం కావాలని.. రైతులకు, రాష్ట్రానికి మేలు జరగాలని కోరుకుంటున్నాను. వ్యవసాయాధారిత రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే రైతన్న బాగుంటాడు. అన్నదాత సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది'అని సీఎం పేర్కొన్నారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ :** 27 మే 2025,

**తిథి :** అమావస్య (ఉ.08:35వ.కు)

**నక్షత్రం :** కృత్తిక (తె.05:34వ.కు), రోహిణి (28తా తె.02:52వ.కు)

**బ్రహ్మ ముహూర్తం :** తె.04:02ల తె.04:50

**రాహుకాలం :** మ.03:18ల సా.04:55,

**యమగండం :** ఉ.08:52ల ఉ.10:28,

**వర్జ్యకాలం :** రా.07:45ల రా.09:20

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ :** 27 మే 2025,

**ఫజర్ :** తెల్లవారుజామున గం. 04:31

**సూర్యోదయం :** ఉదయం గం. 05:49

**జొహర్ :** మధ్యాహ్నం గం. 12:17

**అసర్ :** సాయంత్రం గం. 03:39

**మఘ్రిబ్ :** సాయంత్రం గం. 06:45

**ఇషా :** రాత్రి గం. 08:03



డిజిటల్ పోటీ ప్రపంచంలో ఎదగాలంటే వెబ్ సైట్ తప్పనిసరి.
అతి తక్కువ ధరకే చేయబడును
- న్యూస్ వెబ్ సైట్
- ఈ పేపర్ వెబ్ సైట్
- ఇన్స్పిరేషన్ వెబ్ సైట్
- బిజినెస్ వెబ్ సైట్
- వ్యక్తిగత వెబ్ సైట్
- ఆర్గనైజేషన్ వెబ్ సైట్

సెల్/వాట్సప్ +91-9642067900 వివరములకు సంప్రదించండి
• మీకు నచ్చిన విధంగా చేయబడును
WEB DIGITAL WAY
Visit www.webdigitalway.com

**జన స్వరం**

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
ఆసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# బట్టీ చదువులు భవిష్యత్తుకు చేటు



### బట్టీ చదువులు వద్దు.. ఆత్మస్థైర్యాన్ని నింపే చదువులు ముద్దు

ఈ రోజుల్లో చదువు అనేది పిల్లల జీవితాల్లో ఓ భయంగా, ఓ భారంగా, ఓ పోటీగా మారిపోయింది. "పాస్ అవ్వాలి, ర్యాంక్ రావాలి, ఉద్యోగం రావాలి, అప్పుడే జీవితం సెటిల్" అనే ఒకే విధమైన లక్ష్యంతో నడుస్తున్న విద్యా వ్యవస్థ, నిజమైన విజ్ఞానాన్ని కాకుండా మార్కులను మాత్రమే అంగీకరించే విధంగా రూపాంతరం చెందుతోంది.. చిన్నచిన్న పిల్లలకే మోయలేని బ్యాగుల బరువులు చిన్న తనంలోనే నడుము వంగిపోయి అవస్థలు పడడం, చదువుల ఒత్తిడితో చిన్నతనంలోనే కంటి చూపు మందగించడం నేటి పిల్లలకు శాపంలా మారింది.

ఈ దృష్టికోణం యువతను చదువు పట్ల అసహనంతో నింపుతుంది. చదువు అనేది జీవన నైపుణ్యాన్ని కల్పించాలి కానీ ఒత్తిడిని పెంచకూడదు. కానీ ఈ రోజు పరిస్థితి చూస్తే, చదువు విద్యార్థులకు భారం అయింది. అది భవిష్యత్తును నిర్మించక, నిస్సారంగా మారుస్తోంది. ఒక విద్యార్థి పరీక్షలలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధిస్తాడు కానీ అతనికి జీవితంలో ఎదురయ్యే చిన్న సమస్యలను కూడా ఎదుర్కొనే ధైర్యం ఉండదు అలా చాలా మంది విద్యార్థులు నేటి సమాజంలో చదువులో రాణిస్తున్నారు కానీ జీవితంలో విఫలమవుతున్నారు, ఇది మన విద్యావిధానానికి పెను సవాలుగా మారింది.

**బట్టీ చదువు అంటే ఏమిటి? :**
బట్టీ చదువు అనేది అవగాహన లేకుండా పాఠ్యాంశాలను యాంత్రికంగా గుర్తుపెట్టుకోవడం. ఇది చిన్నపాటి మెమరీ గేమ్ మాత్రమే. దాన్ని పరీక్షలో వాంతి చేసి బయటపెడతారు. తరువాత మిగలేది? శూన్యం. ఈ పద్ధతిలో చదివిన విద్యార్థులు జీవితంలోని అసలైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేరు. పరిచయ సమస్యలు, ఆచరణలో ఎదురయ్యే సవాళ్ళను తట్టుకోలేరు. దీని వలన వారు మరింత అస్థిరతకు లోనవుతారు.

**బట్టీ చదువు దుష్పరిణామాలు :**
**ఆత్మవిశ్వాస లోపం :**
చదివినది అర్థం కాకపోవడం వల్ల నిర్ధారణ లేకుండా ఒక నిర్ణయానికి రావడం, ఆత్మవిశ్వాసంతో నిర్ణయాలు తీసుకోలేకపోవడం
**సొంత తెలివి ఉపయోగించలేరు :**
ప్రశ్నల వెనుక ఉన్న భావాన్ని పట్టుకోలేరు, స్వతంత్రంగా ఆలోచించలేరు.
**సృజనాత్మకత లోపించడం :**
కొత్తగా ఆలోచించగల శక్తి లేకుండా తయారవుతారు. సమస్యలపై స్వయం నిర్ణయం తీసుకునే ధైర్యం లేకుండా మారతారు.
**మానసిక ఒత్తిడి :**
మార్కుల భయం, తల్లిదండ్రుల అంచనాలు, సమాజపు వత్తిడితో మానసిక స్థైర్యం కోల్పోతున్నారు.
**అయితే చదువుకి అసలైన అర్థం ఏమిటి? :**
విద్య అంటే.. మంచి వ్యక్తిగా తయారవడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం, జీవిత సమస్యలకు పరిష్కారం చూపగలగడం. విద్య అంటే "జ్ఞానం, ఆచరణ, ఆత్మస్థైర్యం". ఇది ఏదో పుస్తక జ్ఞానంతో పరిమితం కాక, జీవితాన్ని అర్థం చేసుకునే దిశలో ఉండాలి.
**నిజమైన విద్య ఎలా ఉండాలి? :**
**అభిరుచి ఆధారంగా కోర్సులు :**
ప్రతి విద్యార్థికి ఒక ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. అందరినీ ఒకే తాటిపై కట్టే ప్రయత్నం కాకుండా, ప్రతి ఒక్కరి ఆసక్తిని గుర్తించి, దాన్ని అభివృద్ధి చేసేలా విద్యావిధానం ఉండాలి.
**జీవిత విద్య :**
పిల్లలకు పరీక్షల్లో ఉత్తీర్ణతకన్నా ముందుగా, జీవనంలో ఎలా నడవాలో నేర్పించాలి. ఆత్మస్థైర్యం, కమ్యూనికేషన్, నిర్ణయాలు తీసుకునే శక్తి వంటి జీవన నైపుణ్యాలు ప్రధాన పాత్ర పోషించాలి.
**ప్రయోగాత్మక విద్య :**
పుస్తకాల నుంచి కన్నా, అనుభవ పూర్వకంగా క్షేత్ర స్థాయిలో స్వయంగా

## ఎడిటోరియల్

నేర్చుకునే పాఠాలే విద్యార్థులలో గొప్ప ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయి , దీర్ఘకాలికంగా గుర్తుండే అవకాశం వుంది, జీవితంలో సమస్యల సాధనకు కూడా ప్రయోగాత్మక విద్య ఎంతో సహాయ పడుతుంది
**విలువలతో కూడిన విద్య :**
విద్యార్థులలో నైతికత, మానవత, సానుభూతి వంటి విలువలు పాఠ్యాంశాలతో పాటు మిళితమై ఉండాలి. మార్కుల కన్నా మానవతా విలువలు వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దుతాయి.
**తల్లిదండ్రులు తెలుసుకోవాల్సింది :**
మార్కులు జీవితాన్ని నిలబెట్టావు. పిల్లలు మంచి మార్కులు,ర్యాంక్ సాధించకపోయిన వారిని నిందించకండి. వారి లోపాలను గుర్తించి, మానసికంగా వారిలో ధైర్యాన్ని. విశ్వాసాన్ని నింపాలి అదే తల్లిదండ్రులు వారి పిల్లలను నిజమైన విజేతలగా తీర్చిదిద్దడానికి దోహదపడుతుంది
**ఉపాధ్యాయులు ఆలోచించాల్సింది :**
మీరు బోధించేది పాఠ్యాంశం మాత్రమే కాదు, ఓ జీవన దిశ. విద్యార్థుల్లో ఆలోచన, ప్రశ్నించే ధైర్యం, విశ్లేషణ, జ్ఞానాన్ని వినియోగించే నైపుణ్యాన్ని పెంపొందించాలి. మార్కులు పొందే విద్యార్థులు కాక, మార్గదర్శకులు తయారు చేయండి.
**విద్యార్థులు గుర్తుంచుకోవాల్సింది :**
మీరు చదివేది పుస్తకం కాదు.. ఒక జీవితాన్ని నిర్మించే సాధన. మార్కులు మీ విజయాన్ని నిర్వచించవు. మీరు ఎంతగా సమస్యలను అర్థం చేసుకుని, వాటిని ఎదుర్కొనే ధైర్యాన్ని పెంచుకుంటారో, అదే మీ నిజమైన విజయానికి మూలం.
**ఈ మార్పు :**
కుటుంబం నుంచి, పాఠశాల నుంచి, విద్యావిధానం నుంచి మాత్రమే కాక ప్రధానంగా అందరి మనసుల నుంచి రావాలి. పిల్లలకు భయాన్ని కాదు, లక్ష్యం వైపు నడిపించే ధైర్యాన్ని కలిగించే చదువు అవసరం.

– జి. అజయ్ కుమార్


## యోగా సాధనతో ఆరోగ్యవంతమైన జీవితం

- చింతపల్లి డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు
- చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయభారతి



**చింతపల్లి, మే 26 (జనస్వరం) :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సోమవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) పురస్కరించుకొని అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా ఆసనాలు విద్యార్థులలో మానసిక ఉల్లాసం, ఏకాగ్రత, శారీరక ఆరోగ్యం పెంపొందించేందుకు ఎంతో ఉపయుక్తం. ప్రతిరోజూ ఒక గంట యోగా పాటించడం వలన జీవనశైలిలో అనేక శ్రేయస్సులు పొందవచ్చుని తెలిపారు. ఒక భూమికి యోగా ఒక ఆరోగ్యం అనే థీమ్‌తో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని వాలంటీర్లు తమ గ్రామాల్లో యోగా ప్రాముఖ్యతను చాటి చెప్పాలని, ఆయా ప్రాంతాల్లో ఆసనాలపై అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ పాత్రుడు, ఎన్ఎస్ఎస్ పిఓ వి. ఈశ్వర్, కె. పూర్ణరావు, కె. రవీంద్రబాబు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## నంద్యాల లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు విరాళం అందజేత



**నంద్యాల, మే 26 (జనస్వరం) :** లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు, పారిశ్రామికవేత్త ఆత్మకూరు సుదర్శనం శెట్టి తన మనవడి వివాహ సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆత్మకూరు సుదర్శనం శెట్టి, రుక్మిణమ్మ దంపతుల మనవడు మిథున్ శ్రీ వాత్సవ్, సింధూషల వివాహం సందర్భంగా సేవా కార్యక్రమాల కోసం రూ.లక్ష చెక్కు లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు డాక్టర్ సహదేవుడు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ లకు నూతన దంపతుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ సహదేవుడు మాట్లాడుతూ నంద్యాల లయన్స్ క్లబ్ 1970 లో ప్రారంభించినప్పుడు సభ్యుడిగా చేరిన ఆత్మకూరు సుదర్శనం శెట్టి 55 సంవత్సరాలుగా లయన్స్ సేవా సంస్థలో సభ్యునిగా కొనసాగుతూ అనేక సేవా కార్యక్రమాలకు సహకారం అందించారని, తన మనవడి వివాహ సందర్భంగా చూపిన సేవా దృక్పథం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ తరపున ఆత్మకూర్ సుదర్శనం శెట్టిని శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సుదర్శనం శెట్టి సతీమణి రుక్మిణి, కుటుంబ సభ్యులు చంద్రమోహన్, నిర్మల, రవి కుమార్, మాధవి, రజత్ భార్గవ, ప్రతీక్ష, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నిజాముద్దీన్, శిరిగిరి రమేష్, కోశాధికారి మామిళ్ల నాగరాజు, జోన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, సీనియర్ సభ్యులు ఆంజనేయులు గుప్తా, ఆడిటర్ వంక దారి గోపాల కృష్ణ మూర్తి, రవి ప్రకాష్, శ్రీకాంత్, కసెట్టి వేణుమాధవ్, చంద్రమోహన్, బాబురావు, సోమేశుల నాగరాజు, రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులపై లైంగిక దాడికి యత్నం

**పులివెందుల, మే 26 (జనస్వరం) :** ఇద్దరు చిన్నారులపై లైంగిక దాడికి ఎత్నించిన సంఘటన సోమవారం వైయస్సార్ కడప జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కడప జిల్లా జమ్మలమడుగు పట్టణ పరిధిలోని శివారెడ్డి కాలనీలో ఏడేళ్ల వయసు గల ఇద్దరు చిన్నారులపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి కాలనీవాసులు సోమవారం దేహశుద్ధి చేశారు. చాక్లెట్లు ఇప్పిస్తానని చెప్పి చిన్నారులను తీసుకెళ్తున్న హుస్సేన్ వల్లిని ఓ చిన్నారి తండ్రి గమనించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆగ్రహించిన కాలనీవాసులు అతడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు

# తిరుపతిలో యోగాంధ్ర క్యాంపెయిన్‌కు ఘన ఆరంభం

- జిల్లా, రాష్ట్ర స్థాయిలో యోగా పోటీలు
- కమిషనర్ మౌర్య



**తిరుపతి, మే 26 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర క్యాంపెయిన్‌కు తిరుపతిలో ఘనంగా ఆరంభమైంది. ఈ సందర్భంగా తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్. మౌర్య మాట్లాడుతూ యోగా పోటీలు నగరపాలక సంస్థ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో మే 26 నుండి జూన్ 18 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలు విద్యార్థులు, యువతతో పాటు పౌరులందరిలో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయడం లక్ష్యంగా ఉన్నదన్నారు. పోటీలు వ్యక్తిగత, సమూహ ప్రదర్శనలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, జ్ఞానపరమైన పోటీలుగా సాగనున్నాయని వివరించారు. ఈ కార్యక్రమం క్రమబద్ధంగా నాలుగు స్థాయిల్లో నిర్వహించనున్నారు. మే 26 నుండి 30 వరకు వార్డు స్థాయిలో, జూన్ 2 నుండి 7 వరకు నగర స్థాయిలో, జూన్ 9 నుండి 14 వరకు జిల్లా స్థాయిలో, చివరకు జూన్ 16 నుండి 18 వరకు రాష్ట్రస్థాయిలో గ్రాండ్ ఫినాలే జరగనుంది. ప్రతి స్థాయికి ఒక ప్రత్యేక థీమ్‌ను కూడా నిర్ణయించారు. గ్రామస్థాయి ఆరోగ్యమేళనం నుంచి యువతతో ఆరోగ్య భవిష్యత్ నిర్మాణం వరకు వివిధ అంశాలను ప్రాతినిధ్యం వహించేలా ఈ థీమ్‌లు రూపుదిద్దుకున్నాయి. పోటీల్లో జూనియర్స్ (10–18 ఏళ్ల వయసు), మిడిల్ ఏజ్ (19–35), సీనియర్లు (35 ఏళ్లు పైబడినవారు) వేర్వేరు వర్గాలుగా పాల్గొనవచ్చు. మే 26న జూనియర్లకు సోలో యోగా, ఆసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం పోటీలు జరుగుతాయి. మే 27న మిడిల్ ఏజ్ మరియు సీనియర్లకు పోటీలు కొనసాగుతాయి. మే 28, 29 తేదీల్లో మూడు వర్గాల వారికీ యోగా పాటలు, పెయింటింగ్, యోగా స్కిట్, రోల్‌ప్లే వంటి కార్యక్రమాలు నిర్వహించబడతాయి. మే 30న యోగా క్విజ్, పోస్టర్ డిజైన్, స్లోగన్, షార్ట్ ఫిలిం, ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల నిర్వహణ కోసం ప్రతి స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. పోటీలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. పాల్గొనదలచిన వారు తమ సచివాలయ కార్యదర్శులు, నగరపాలక సంస్థలు లేదా జిల్లా స్థాయి నోడల్ అధికారుల ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలు వరుసగా తదుపరి స్థాయిలకు ఎంపికవుతారు. పోటీల్లో న్యాయత, భద్రత, ప్రామాణికతకు ప్రభుత్వం అధిక ప్రాముఖ్యత ఇస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు. న్యాయనిర్ణేతల తీర్పే తుదినిర్ణయంగా భావించనున్నట్లు తెలిపారు. యోగాంధ్ర క్యాంపెయిన్ ద్వారా యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, సాంస్కృతిక విలువలను బోధించడమే ముఖ్య ఉద్దేశమని మౌర్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పునాది వేయనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మరింత సమాచారం కోసం సచివాలయ కార్యదర్శులను లేదా నగరపాలక అధికారులను సంప్రదించాలని ఆమె సూచించారు.

## తెలుగువారి ఆత్మగౌరవ దినోత్సవంగా ఎన్టీఆర్ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

**సీఎం చంద్రబాబుకు 'తెలుగు శక్తి' అధ్యక్షుడు బి.వి.రామ్ విజ్ఞప్తి**



**విశాఖపట్నం, మే 26 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** తెలుగువారి గర్వకారణమైన నటుడు, రాజకీయ శిఖరం నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తెలుగువారి ఆత్మగౌరవ దినోత్సవంగా ప్రకటించి, అధికారికంగా నిర్వహించేందుకు తక్షణమే జీవో విడుదల చేయాలని 'తెలుగు శక్తి' అధ్యక్షుడు బి.వి.రామ్ సీఎం చంద్రబాబును కోరారు. స్థానిక విజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్‌ను తెలుగు ప్రజలు ఒక భగవంతుడిలా కొలిచేవారని, తిరుపతిలో వెంకటేశ్వరుడిని దర్శించిన తర్వాత చెన్నైకి వెళ్లి ఎన్టీఆర్‌ను దర్శించేవారని గుర్తుచేశారు. "భారతదేశంలో ఆ స్థాయి ప్రజాభిమానాన్ని పొందిన నాయకుడు మరొకరు లేరు. అలాంటి మహానుభావుడి జయంతిని తెలుగు ప్రజల ఆకాంక్ష మేరకు పండుగలా జరపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా" అని అన్నారు. "నాకు పదవులపై ఆశ లేదు, స్వార్థం లేదు. నేను కోరేది ఒక్కటే – తెలుగువారి గౌరవానికి గుర్తుగా ఎన్టీఆర్ జయంతిని ఆత్మగౌరవ దినంగా ప్రభుత్వమే నిర్వహించాలి," అని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ వర్ధంతి (జనవరి 18)తో తన జన్మదినం ఒకే రోజు కావడంతో ఆయన్ను పట్ల తనకున్న గాఢమైన అనురాగాన్ని ఆయన వ్యక్తపరిచారు. తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోయారని, కానీ చాలామంది ఈ విషయాన్ని బహిరంగంగా చెప్పలేకపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే మే 27లోగా జీఓ విడుదల చేసి జూన్‌లో జరిగే మహానాడు వేడుకలు పండగ వాతావరణంలో జరగేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం ఉప పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వీరందరూ దీనిపై సానుకూలంగా స్పందించి కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టను పెంచే అడుగు అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోడె బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్కల స్వైర్య విహారం



**పులివెందుల, మే 26 (జనస్వరం) :** పిచ్చి కుక్కలు స్వైర్య విహారం చేసిన సం ఘటన వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్ పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు సుమారు 27 మంది వీధి కుక్కల కాటుకు గురయ్యారు. బాధితులు బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. కుక్కల బెడద నివారించాలని బాధితులు అధికారులను కోరుతున్నారు.

## మా సమస్యలు పరిష్కరించండి

**పీఓ అపూర్వ భరత్‌ను కలిసిన అంబేద్కర్ కాలనీవాసులు**



**విఆర్‌పురం, మే 26 (జనస్వరం) :** మండలంలోని వడ్డిగూడెం పంచాయతీకి చెందిన వి.ఆర్.పురం గ్రామ అంబేద్కర్ కాలనీవాసులు తాము ఎదుర్కొంటున్న జీవన సమస్యలను పరిష్కరించాలంటూ చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో ఆర్ అండ్ ఆర్ విభాగ అధికారి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్‌ను సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "మా కాలనీలో సుమారు 100 మంది పునరావాసం కోసం ఎదురు చూస్తున్న దళిత కుటుంబాలు నివాసం ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టు కారణంగా మేము మొదటి వరద స్థాయిలో ముంపుకు గురి అయ్యాం. అందువల్ల మాకు ఒకే చోట, కృష్ణా జిల్లా తిరువూరు పరిధిలో పునరావాస కాలనీ ఏర్పాటు చేయాలని మనవి చేస్తున్నాం," అని తెలిపారు. వీరు తమ పిల్లల విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే తమ ఆకాంక్ష అని చెప్పారు. అంతేకాక, తామే స్వయంగా ఇంటి నిర్మాణానికి ముందుకు రావాలన్న ఉద్దేశంతో ఉన్నామని, అయితే అందు కోసం ప్రభుత్వం కనీసం రూ.6 లక్షల వరకు ఆర్థిక సాయం అందించాలంటూ అధికారిని కోరినట్లు పేర్కొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన పీఓ అపూర్వ భరత్, సమస్యలను సహానుభూతితో ఆలకించి తగిన పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు కాలనీవాసులు తెలిపారు. సమస్యలపై చిత్తశుద్ధితో స్పందించిన అధికారికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో అంబేద్కర్ కాలనీ పునరావాస కమిటీ సభ్యులు అల్లాడి రాజు, యడ్ల శ్రీరామ్ మూర్తి, బండి శ్రీనివాస్, యడ్ల జయరాజు, మాచర్ల వేణు, రాము, కృష్ణ, కల్పన్, వెంకట్ మహేష్, రాణి, శ్రావణి, అరుణ, పద్మ తదితరులు పాల్గొన్నారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఈ ప్రయత్నం విజయవంతం కావాలని కాలనీవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



**పులివెందుల మే 26 (జనస్వరం) :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లింగాల మండల పరిషత్ సభా భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన యోగా శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. వ్యాయామం, ధ్యానంతో పాటుయోగ కూడా సగటు మనిషి ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. వచ్చే నెల 21వ తేదీ వరకు శిక్షణా తరగతులు ఉంటాయని వెల్లడించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని నెలరోజులపాటు ఏర్పాటు చేస్తున్న యోగా శిక్షణా తరగతులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# కోకో గింజలకు ప్రభుత్వం చెప్పిన ధర అమలు కావడం లేదు

**- కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వాలి**
**- ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం డిమాండ్**



**ఏలూరు, మే 26 (జనస్వరం) :** కోకో గింజలకు ప్రభుత్వం చెప్పిన ధర కిలోకు రూ.500 అమలు కావడం లేదని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. సోమవారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ముఖ్య నాయకుల సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన ధర అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కిలోకు రూ.500 ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేయాలని కంపెనీలను, ట్రేడర్లను ఈనెల 23వ తేదీన ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో నిర్ణయించి ఆదేశించినా క్షేత్రస్థాయిలో ప్రభుత్వం చెప్పిన ధర అమలు కావడం లేదన్నారు. కంపెనీలు, ట్రేడర్లు కిలో కోకో గింజలకు రూ.450 మాత్రమే ఇస్తామని చెప్పగా ప్రభుత్వం నుండి రూ.50 చెల్లిస్తాము కిలో కోకో గింజలను రూ.500 కొనుగోలు చేయాలని రాష్ట్ర మంత్రులు చెప్పినా ఈ ధర ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కంపెనీలకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రైతుల నుండి సక్రమంగా కోకో గింజలను కంపెనీలు, ట్రేడర్లు కొనుగోలు చేయడం లేదన్నారు. రైతులు వద్దనున్న మొత్తం కోకో గింజలు కొనుగోలు చేస్తామని చెప్పి రైతుల నుండి మరలా కొద్ది కొద్దిగా కొనుగోలు చేసే విధానాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను కూడా కంపెనీలు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం చెప్పిన ధరకు తక్కువగా కొనుగోలు చేయకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరారు. కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించకపోవడం వలన కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అంతర్జాతీయ మార్కెట్ ధరను అనుసంధానిస్తూ ఫార్ములా నిర్ణయించి ధర ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధర వచ్చేవరకు కోకో రైతుల పోరాటం కొనసాగుతుందని తెలియజేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ళ వెంకట సుబ్బారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆలపాటి శ్రీనివాసరావు, రాయల కాళీ బాబు, ఈడుపుగంటి శ్రీనివాసరావు, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద 163 కేజీల గంజాయి పట్టివేత



**జగ్గంపేట, మే 27 (జనస్వరం) :** కిర్లంపూడి మండలం, కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేసినప్పుడు కుటుంబ సభ్యుల పర్యాటకం మాటున గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకున్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విశాఖ జిల్లా గోపాలపురం గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు మరియు వారి స్నేహితులు కలిసి గంజాయి రవాణాకు పుష్పంగా కనిపించే విధంగా ఈ ముఠా ఏర్పరుచుకుని గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నారని డీఎస్పీ తెలిపారు. దండగలుగా ఉపయోగించిన బొలెరో వాహనం, బ్రిజా కార్ టాప్ లోపల 163 కేజీల గంజాయి ప్యాకెట్లు దాచి తరలిస్తున్నప్పుడు పోలీసులు వారికి చిక్కుకున్నారు. పర్యాటకులు వచ్చానంటూ నటించి అనుమానాన్ని దూరం చేయాలనుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.8.16 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ ఘటనలో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు పట్టుబడ్డారు. ఈ గంజాయి పట్టివేతకు సంబంధించిన దర్యాప్తులో జగ్గంపేట ఎస్సై టీ రఘునాధరావు, కిర్లంపూడి ఎస్సై సతీష్ కుమార్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వావింటిపర్తి గిరిజన కాలనీ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పర్యటన



**పొదలకూరు, మే 26 (జనస్వరం) :** సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు, పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పొదలకూరు మండలం వావింటిపర్తి గ్రామంలోని గిరిజన కాలనీలో సోమవారం పర్యటించారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి, జనసేన ఆవిర్భావానికి అనుకూలంగా ఉన్న ప్రజలతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “పవన్ కళ్యాణ్ అభిప్రాయాలు, ఆయన దృక్పథం ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. రాష్ట్ర అభివృద్ధిలో, అటవీ శాఖ, గ్రామీణాభివృద్ధి, రాష్ట్రానికి కేంద్ర నిధుల ఆహరణ వంటి అంశాలలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. అంతేగాక, దేశ సరిహద్దుల్లో జవాన్ల త్యాగాలకు అండగా నిలబడి దేశభక్తిని ప్రజల్లో పెంపొందిస్తున్నారు,” అని చెప్పారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా జనసేన వైపు ఆకర్షితులవుతున్న ప్రతీ ఒక్కరిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తూ, వారికి పార్టీ పరంగా అండగా ఉంటామని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో యువతలో చైతన్యం తేవడానికి, వారిని రాష్ట్ర అభివృద్ధి, దేశ రక్షణలో భాగస్వాములుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలోని సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని సురేష్ నాయుడు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో స్థానిక మండల నాయకులు ప్రసాద్, మనోజ్, వెంకటాచలం మండల కార్యదర్శి సందూరి శ్రీహరి, మండల నాయకులు మణి తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండగగా కామాక్షితాయి అమ్మవారి కళ్యాణోత్సవం

**పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి**





**కోవూరు, మే 26 (జనస్వరం) :** బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత శ్రీ కామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వైభవంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ పండగను కానుకగా భావించి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ పరిసరాలు కిటకిటలాడిపోయాయి. శివనామ స్మరణతో జొన్నవాడ గ్రామం మారుమోగిపోయింది. కామాక్షి తాయి స్వామివార్ల కళ్యాణోత్సవ సందర్భంలో కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పట్టు వస్త్రాలను స్వామివార్లకు సమర్పించారు. పట్టు వస్త్రాలను తలపై పెట్టుకుని స్వామి సన్నిధికి చేరిన ప్రశాంతమ్మ ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఈ పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించి దివ్య దర్శించుకున్నారు. అనంతరం ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ వైభవ కార్యక్రమంలో జొన్నవాడ ఆలయ సేవా కమిటీ చైర్మన్ తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఈఓ శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ పెంచలయ్య, బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, టిడిపి నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి జీసీసీ మేనేజర్‌గా సుగునాదం బాధ్యతల స్వీకరణ



**చింతపల్లి, మే 26 (జనస్వరం) :** చింతపల్లి గిరిజన సహకార సంస్థ (జీసీసీ) మేనేజర్‌గా చల్లంగి సుగునాదం సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పాడేరు డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, అనంతరం కార్యాలయ సూపరిండెంట్‌గా పని చేసిన సుగునాదం, పదోన్నతిపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ పదవికి ఎంపికయ్యారు. ఇంతకు ముందు డివిజన్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న దేవరాజు, అదనపు బాధ్యతలతో మేనేజర్‌గా కొనసాగారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జీసీసీ సిబ్బంది సుగునాదాన్ని పుష్పగుచ్ఛాలతో సన్మానించి హర్షాతిరేకాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజనులకు మెరుగైన సేవలందించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని, సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గోధుము సూపరిండెంట్ మజ్జి రమణమూర్తి, సెల్స్‌మన్ శెట్టి చిన్నబ్బాయి, భారతి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం జనసేన యువ నాయకుడి “ట్రీ చాలెంజ్”



**విజయనగరం, మే 26 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** స్థానిక జనసేన పార్టీ యువ నాయకుడు, ఉత్తరాంధ్ర ఎన్నికల కమిటీ సభ్యులు హుస్సేన్ ఖాన్ పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ “ట్రీ చాలెంజ్” అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కుమార్తె హఫీజ్ ఖాన్‌తో కలిసి మొక్కలు నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెట్లు మనిషి మనుగడకు ఎంతో కీలకమైనవని, ప్రకృతిని కాపాడటమే భవిష్యత్ తరాలకు మంచి జీవన విధానాన్ని అందించడమేనన్నారు. చెట్లు లేకపోతే మనిషి జీవించలేడని, అందువల్ల ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలనే లక్ష్యంతో ఈ “రీ-ట్రీ చాలెంజ్” చేపట్టినట్లు తెలిపారు. ఈ చాలెంజ్ ప్రకారం, మొక్కలు నాటిన వారు మరో ఐదుగురికి చాలెంజ్ ఇవ్వాలని, ఈ విధంగా ఈ కార్యక్రమం శాశ్వతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. మొదట ఈ చాలెంజ్‌ను జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని, విజయనగరం జిల్లా జనసేన నాయకులు గురాన అయ్యలు, అవునపు విక్రమ్, జనసైనికులు పండు, భవానిలకు ఇచ్చారు. “ట్రీ చాలెంజ్” కార్యక్రమం ద్వారా సమాజంలో పచ్చదనాన్ని పెంపొందించడమే కాకుండా, ప్రతి ఒక్కరినీ ప్రకృతి పరిరక్షణలో భాగస్వామ్యులుగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. ఈ చైతన్య ప్రదర్శనకు ప్రజలు పెద్ద ఎత్తున స్పందించాలని హుస్సేన్ ఖాన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## పెదపాడు శాఖా గ్రంథాలయంలో గణిత శిక్షణ

**విజ్ఞానంతో సాగిన వేసవి శిబిరం**



**పెదపాడు, మే 26 (జనస్వరం) :** స్థానిక శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా సోమవారం విద్యార్థుల కోసం ప్రత్యేక గణిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ కే.దుర్గా “గణిత సూత్రాలు”పై పాఠం నిర్వహించారు. గణిత శాస్త్రాన్ని భయంగా భావించే విద్యార్థులకు ఆసక్తికరంగా, సరళంగా అర్థమయ్యేలా వివరిస్తూ, క్షేత్ర గణితంపై ప్రత్యేక దృష్టి సారించారు. త్రిభుజం, దీర్ఘచతురస్రం, చతురస్రం, సమాంతరచతుర్భుజం, రాంబాస్, వృత్తం, కంకణం, సెక్టార్, ట్రైపిజియం వంటి ఆకారాలపై, అలాగే సమ ఘనం, దీర్ఘ ఘనం, పట్టకం, పిరమిడ్, స్తూపం, శంఖువు, గోళం, క్రమ బహుభుజి వంటి ఘనాలపై వివరమైన వివరణలు ఇచ్చారు. అంతకుముందు కోనే నాగ వెంకట ఆంజనేయులు రచించిన “వజ్రాల హారం” అనే నీతి కథను విద్యార్థులతో చదివించి, కథలోని నైతిక సందేశాన్ని వివరించారు. విద్యార్థులను కథలతో మమేకం చేస్తూ, పుస్తక సమీక్షలు చేయించడం కూడా జరిగింది. పాటల విభాగంలో దేశభక్తి గీతాలను నేర్పించి, విద్యార్థులతో కలిసి పాడించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 21 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఉత్సాహభరిత శిక్షణ కార్యక్రమాన్ని దుగ్గిపోగు జాన్ బాబు నిర్వర్తించారు. పాల్గొన్న విద్యార్థులకు పాఠశాల అనంతరం స్నాక్స్ పంపిణీ చేశారు. గ్రంథాలయ వేదికగా విద్యార్థులకు అందించిన ఈ గణిత శిక్షణ కార్యక్రమం వారికి భవిష్యత్తులో గణితంపై విశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

## పవన్ కల్యాణ్ సినిమా రిలీజ్‌ను అడ్డుకునే దమ్ము ఎవరికీ లేదు

**నిర్మాత దిల్ రాజు**

**హైదరాబాద్, మే 26 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** టాలీవుడ్ స్టార్ హీరో పవన్ కల్యాణ్ సినిమాను అడ్డుకునే ధైర్యం ఎవరికీ లేదని ప్రముఖ నిర్మాత దిల్ రాజు స్పష్టం చేశారు. సినీ పరిశ్రమలో నెలకొన్న తాజా వివాదాలపై సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సినీ పరిశ్రమకు అందిస్తున్న మద్దతు అమోఘమని కొనియాడిన దిల్ రాజు, రెండు రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో పరిశ్రమ ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. థియేటర్ల వ్యవహారంలో నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య తలెత్తిన వివాదాలపై కమిటీ ఏర్పాటు చేస్తామని, అన్ని సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

**థియేటర్ల వివాదం నేపథ్యంలో వివరణ :**
తూర్పు గోదావరి జిల్లా నుంచి థియేటర్ల వివాదం ఉద్భవించిందని, ఏప్రిల్ 19న ఎగ్జిబిటర్ల సమావేశం నిర్వహించి పర్సంటేజ్ విధానం అమలు కావాలని డిమాండ్ చేశారని దిల్ రాజు తెలిపారు. ఈ అంశం ఏప్రిల్ 26న తమ దృష్టికి వచ్చిందని, తొలి వారం రెంట్, అనంతరం పర్సంటేజ్ విధానం కొనసాగుతుందని వివరించారు. థియేటర్ల మూసివేతపై ఎగ్జిబిటర్ల లేఖను ఛాంబర్‌కు పంపినప్పటికీ, తాము అటువంటి ప్రతిపాదన చేయలేదని స్పష్టం చేశారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య చర్చలు జరిగినాయని, సినిమా విడుదలలకు ఎలాంటి ఆటంకం ఉండకూడదని తాము కోరామన్నారు.

**పవన్ సినిమా రిలీజ్‌పై స్పష్టత :**
పవన్ కల్యాణ్ సినిమా విడుదలపై సబ్జెక్ట్ డైవర్ట్ అయ్యిందని, కానీ ఆయన సినిమా రిలీజ్‌ను అడ్డుకునే ధైర్యం ఎవరికీ లేదని దిల్ రాజు ఖచ్చితంగా చెప్పారు. మధ్యలో జరిగిన మిస్ కమ్యూనికేషన్ వల్లే వివాదం పెద్దదైందన్నారు. మంత్రి కందుల దుర్గేష్‌తో తాను మాట్లాడి విషయాన్ని స్పష్టంగా వివరణ ఇచ్చినట్లు తెలిపారు. జూన్ 11న కమల్ హాసన్ చిత్రం, జూన్ 12న పవన్ కల్యాణ్ చిత్రం, జూన్ 20న కుబేరా సినిమా విడుదలవుతాయని దిల్ రాజు వెల్లడించారు. జులై, ఆగస్టులోనూ పలు పెద్ద సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

**సినీ పరిశ్రమలో ఐక్యతకు దిల్ రాజు పిలుపు :**
తలెత్తిన సమస్యలను ఐకమత్యంతో పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని, ప్రతీ ఒక్కరూ పరిశ్రమ సంక్షేమానికి తోడ్పడాలని దిల్ రాజు పిలుపునిచ్చారు. ఎవరి దారి వారిదే అన్న మనస్తత్వాన్ని మార్చుకుని, అందరూ కలిసికట్టుగా ముందుకెళ్లాలన్నదే తమ సంకల్పమన్నారు.

## సాయి బాబా ఆలయం వద్ద బస్ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయండి

**గ్రామస్థుల వినతి**



**భైంసా, మే 26 (జనస్వరం) :** మండలంలోని దేగాం గ్రామంలో సాయి బాబా ఆలయం వద్ద బస్ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. భక్తులు ప్రతిరోజూ ఆలయాన్ని దర్శించేందుకు వస్తుండగా, తిరిగి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లడానికి సుమారు అర్ధ కిలోమీటర్ నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు తెలిపారు. అలాగే, ఆలయం వద్దకు వచ్చి బస్సు ఎక్కే గ్రామ ప్రజలు కూడా బస్టాండ్‌కు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో సాయి బాబా ఆలయం, బీడీ పంపని సమీపంలో బస్ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేసి, భైంసా-నిజామాబాద్ మార్గంలో నడిచే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు అక్కడ ఆగేలా చర్యలు తీసుకోవాలని డిపో అధికారులను కోరారు. సోమవారం భైంసా ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. భక్తులు, గ్రామ ప్రజల సౌకర్యార్థం వీరి విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలని వారు కోరారు.

## బుద్ధుడు విగ్రహ పునఃప్రతిష్ఠాపనకు డిమాండ్

**రిలే నిరాహార దీక్షకు భవ్య ప్రారంభం**




**భైంసా, మే 26 (జనస్వరం) :** ముధోల్ మండలం బోరిగాం గ్రామంలో బుద్ధుడు విగ్రహాన్ని ప్రభుత్వం తిరిగి ప్రతిష్టించాలనే డిమాండ్‌తో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బుద్ధ అంబేద్కర్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన రిలే నిరాహార దీక్ష మొదటి రోజే విజయవంతంగా సాగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు స్పందించే వరకు నిరాహార దీక్షను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల మద్దతుతో దీక్షకు మంచి స్పందన లభించిందని తెలిపారు. బోరిగాంలో బుద్ధుడి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. సామాజిక న్యాయ సాధనలో భాగంగా తమ పోరాటం కొనసాగుతుందని, బుద్ధుడి మహాత్మ్యాన్ని తక్కువ చేసే ప్రయత్నాలను సహించేది లేదని స్పష్టం చేశారు.

## పల్లెకు పోదాం పాదులు తవుదాం..చలో చలో

**పారపట్టిన మంత్రి నిమ్మల**



**పులివెందుల, మే 26 (జనస్వరం) :** పల్లెకు పోదాం పాదులు తవుదాం చలో చలో అన్న పాటకు స్ఫూర్తిగా మంత్రి నిమ్మల రామనాయుడు పార పట్టారు. రాష్ట్రానికి మంత్రి అయినా పార్టీకి మాత్రం కార్యకర్తనే అంటూ నిమ్మల రామానాయుడు మహానాడు పనుల్లో సోమవారం స్వయంగా పాల్గొన్నారు. మహానాడు సభా ప్రాంగణ కమిటీ కన్వీనర్‌గా ఉన్న ఆయన.. వర్షం వల్ల సభా ప్రాంగణంలోకి నీళ్లు రావడంతో స్వయంగా రంగంలోకి దిగారు. పార పట్టి దగ్గరుండి సభా ప్రాంగణాన్ని చదును చేశారు. కడప వేదికగా టీడీపీ మహానాడు సంబరం మంగళవారం ప్రారంభమవుతోంది. టీడీపీ చరిత్ర తొలిసారిగా వైఎస్సార్ కడప జిల్లాలో జరుగుతున్న కార్యక్రమానికి ఏర్పాట్లన్నీ దాదాపు పూర్తి కావొచ్చాయి. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు సోమవారం సాయంత్రం ఇక్కడికి రానున్నారు. అంతకు ముందే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కుప్పం నుంచి కడపకు చేరుకోనున్నారు. ఇప్పటికే మంత్రులంతా తరలివచ్చారు. పార్టీ తోరణాలు, కటౌట్లు, ఫ్లెక్సీల మహానాడు ప్రాంగణం కళ ఉట్టి పడుతోంది. ఈ క్రమంలో మంత్రి పార పట్టడం సర్వత్రా ఆశ్చర్యానికి గురి చేసింది.

WWW.JANASWARAM.COM
జనస్వరం

## మహానాడుకు వెళ్తూ కార్యకర్త కొట్టుకెళ్లి టీతాగిన లోకేష్

**అభిమాన నేత కదిలిరావడంతో చెంగాచారి భావోద్వేగం**



**కుప్పం/శాంతిపురం, మే 26 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** కుప్పం నియోజకవర్గం శాంతిపురానికి చెందిన చెంగాచారి సాధారణ టీడీపీ కార్యకర్త గృహప్రవేశం నిమిత్తం కుప్పం రెండురోజులుగా బిజీబీజీగా ఉన్న రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిశాడు. చెంగాచారి బాగోగులను వాకబు చేసిన లోకేష్ మాటల్లో ఏం చేస్తుంటావని అడిగాడు. తాను పార్టీ వీరాభిమానినని, శాంతిపురంలో టీ కొట్టు నడపుతూ జీవనం సాగిస్తున్నానని చెప్పాడు. కుప్పం నుంచి కడప మహానాడుకు బయలుదేరిన యువనేత లోకేష్ సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా టీకొట్టు వద్దకు వెళ్లాడు. అన్నా... చాలా దూరం వెళ్లాలి.. టీ ఇస్తావా అని అడిగాడు. చెంగాచారికి కొద్దిసేపు నోటమాట రాలేదు. తమ అభిమాన నేత నేరుగా తమ కొట్టుకురావడంతో సంభ్రమాశ్చర్యానికి లోనయ్యాడు. యువనేత లోకేష్‌కు టీ గ్లాసు అందించాడు. వ్యాపారం ఎలా ఉందని అడగ్గా చెంగాచారి స్పందిస్తూ... సర్.. నేను 1994 నుంచి తెలుగుదేశం పార్టీలో ఉంటున్నా. చంద్రబాబు గారంటే అభిమానం. టీడీపీకి చెందిన వాడినన్న కోపంతో గత 5ఏళ్లు నా టీ అంగడి మూయించారని వైసీపీ దుర్మార్గ ప్రవర్తనను గుర్తు చేసుకున్నారు.

## తాడినాడలో వందేళ్ల తాతకు శతజన్మదిన వేడుకలు




**కైకలూరు, మే 26 (జనస్వరం) :** "శతమానం భవతి శతాయుః పురుషః శతేంద్రియే..." అనే శాంతి మంత్రంలో చెప్పినట్టు నిండు నూరేళ్ల సంపూర్ణ ఆరోగ్యంతో జీవించడం నిజంగా అరుదైన వరం. అలాంటి అదృష్టాన్ని పొందినవారిలో ఒకరైన తాడినాడ గ్రామానికి చెందిన అల్లూరి వెంకటరామరాజు (రాజబాబు) 100వ పుట్టినరోజును మూడు తరాల మనవళ్ళు, మనవరాళ్ల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండి మండలానికి చెందిన తాడినాడ గ్రామంలో జరిగిన ఈ శతజయంతి వేడుకలు అల్లుళ్ళు, బంధువుల సమక్షంలో పండుగ వాతావరణాన్ని తలపించాయి. అల్లుడైన బుట్టో బంగార్రాజు నివాసంలో జరిగిన ఈ వేడుకల్లో, ముందుగా కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులంతా కలిసి వెంకటరామరాజు గారి సతీమణి సత్యవతిగారి ఆశీర్వాదం తీసుకొని స్మరణీయంగా ఫోటోలు దిగారు.

**శతవత్సర స్మృతులు :**

అల్లూరి వెంకటరామరాజు 1925, మే 26న జన్మించారు. 1945లో సత్యవతితో వివాహం జరిపారు. వీరికి కుమార్తె విజయలక్ష్మి జన్మించగా, ఆమెను తాడినాడ గ్రామానికి చెందిన బుట్టో బంగార్రాజుతో వివాహం చేశారు. వారికీ ఇద్దరు కుమార్తెలు పుట్టారు. ప్రస్తుతం వెంకటరామరాజు సంపూర్ణ ఆరోగ్యంతో, మాంసాహారం ఇష్టంగా తీసుకుంటూ, తన పనులు తానే చేసుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారు. ఆసుపత్రి చుట్టూ కూడా వెళ్లాల్సిన అవసరం ఎప్పుడూ రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. కుమార్తెలు కునాదిరాజు పద్మావతి, గొట్టుముక్కల గీతాభవాని, అల్లుళ్లుగా గొట్టుముక్కల దుర్గాప్రసాద్ మూర్తిరాజు (కొండూరు మాజీ సర్పంచ్), కునాదిరాజు శ్రీనివాసరావు తదితర కుటుంబ సభ్యులు ఈ వేడుకలో పాల్గొన్నారు. వందేళ్ల జీవిత ప్రయాణాన్ని గుర్తుగా నిలుపుకుంటూ, తాతకు శత జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుక తాడినాడ గ్రామానికే కాదు, సమీప గ్రామాలకు సైతం స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

## ఎండీయూ వాహనాలతోనే రేషన్ పంపిణీ చేయాలి

**ఏఐటీయూసీ రాష్ట్ర నేత కోన లక్ష్మణ డిమాండ్**




**అనకాపల్లి/యలమంచిలి, మే 26 (జనస్వరం) :** రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే ఎండీయూ విధానాన్ని రద్దు చేయడం వల్ల సుమారు 20 వేల కుటుంబాలు రోడ్డున పడతాయని, అందుకే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కోన లక్ష్మణ సోమవారం డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరిచి వాహనాల ద్వారానే రేషన్ సరఫరా కొనసాగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లా ఎండీయూ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ హాస్పిటల్ నుంచి బయలుదేరిన నిరసన ప్రదర్శన 4రోడ్లు, చిన్న నాలుగు రోడ్లు, సుంకర మెట్ట జంక్షన్ దాటి జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరి వినతిపత్రం సమర్పిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో కోన లక్ష్మణతో పాటు సంఘం అధ్యక్షులు జెట్టి శ్రీను, ప్రధాన కార్యదర్శి బంగారు లక్ష్మణ్ పాల్గొన్నారు. కోన లక్ష్మణ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎండీయూ విధానాన్ని అమలు చేస్తూనే రేషన్ డీలర్లను కొనసాగించినందున, ఇప్పుడు కూడా రెండింటినీ అమలు చేయవచ్చని, అకస్మాత్తుగా విధానం రద్దు చేయడం వలన వందల మంది హెల్పర్లు, సుమారు 20 వేల కుటుంబాలు భవిష్యత్తు బారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వీరికి 2027 వరకు రాష్ట్ర ప్రభుత్వంతో అగ్రిమెంట్ ఉందని, వాహనాలపై ఈఎంఐలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఉచితంగా వాహనాలు ఇచ్చిందని ప్రస్తావించారు. రేషన్ పంపిణీ విధానంలో లోపాలు ఉంటే వాటిని సరిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వమే కలిగిందని, ఎండీయూ విధానాన్ని రద్దు చేయడం అనాలోచిత నిర్ణయం కాబట్టి వెంటనే దాన్ని వెనక్కి తీసుకోవాలని కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఎండీయూ ఆపరేటర్ల న్యాయ పోరాటానికి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఎండీయూ ఆపరేటర్స్ కొవ్వూరు ప్రసాద్, కాళీ తారకేశ్, వజ్రపువేణు, ఏఐటీయూసీ నాయకులు వాయి బోయిన శేఖర్, కోరిబిల్లి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

**యలమంచిలి, మే 26 (జనస్వరం) :** యలమంచిలి టౌన్‌లో వీరభద్ర స్వామి గుడి సమీపంలో నివాసం ఉంటున్న ఎడ్ల సన్యాసినాయుడు (37) ఆదివారం రాత్రి ఎలక్ట్రికల్ షాప్ నుండి పని ముగించి తిరిగి తన అత్తవారింటికి పెద్దపల్లి వెళ్ళేందుకు యలమంచిలి బైపాస్ రోడ్డు, పెద్దపల్లి జంక్షన్ వద్ద రోడ్డు దాటుకుంటుండగా, తుని వైపు నుండి అనకాపల్లి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం అతనిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో సన్యాసినాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం గురించి సోమవారం ఉదయం ఆయన భార్య ఎడ్ల కరుణ యలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. ప్రస్తుతం టౌన్ పోలీసులు ఘటనా స్థలంలో దర్యాప్తు చేపట్టారు.

### కడప మహానాడులో అతిథులను పలకరించనున్న

# గోదావరి ఆవకాయ ఘాటు



**దెందులూరు, మే 26 (జనస్వరం) :** తెలుగుదేశం పార్టీ మహానాడులో పాల్గొనే కార్యకర్తలకు, అతిథులకు మరపురాని రుచి అనుభవాన్ని అందించేందుకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గోదావరి ఆవకాయ పచ్చడి తయారవుతోంది. వంటకాల తయారీ, నాణ్యత, వడ్డింపు తదితర అంశాలను పర్యవేక్షించే భోజనాల నిర్వహణ కమిటీలో చింతమనేనికి ముఖ్య బాధ్యతలు అప్పగించారు. గోదావరి తీరంలో పుట్టి పెరిగిన ఆయనకు ఆవకాయ పచ్చడి విషయంలో ప్రత్యేక అభిమానం, అనుభవం ఉంది.

**వేల మామిడికాయలు.. ఘాటు గోదావరి రుచి :**

చింతమనేని ప్రభాకర్ స్వయంగా వేలాది మామిడికాయలను ట్రక్కుల్లో కడప మహానాడుకు తరలించారు. మామిడికాయ ముక్కలు కోసే నిపుణులను, పచ్చడి కలిపే చేతివాటం ఉన్నవారిని ప్రత్యేక బస్సుల్లో కడపకు తీసుకెళ్లారు. ఈ ప్రత్యేక ప్రయత్నంలో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి కూడా పాల్గొన్నారు. "మేమూ ఉన్నాం" అంటూ వారు స్వయంగా వంటకాల్లో చేయి కలిపారు.

**చింతమనేని అంటేనే ఘాటు ఘాటు :**



చింతమనేని ప్రభాకర్ పేరు వినగానే గోదావరి తీరంలో ఘాటు ఆవకాయ రుచి గుర్తొస్తుంది. ఆయన పర్యవేక్షణలో తయారవుతున్న పచ్చడికి మరింత రుచి, ఘాటు ఉంటుందని తెలుగు తమ్ముళ్లు చెబుతున్నారు. "ఓటు వేయించడంలోనూ, వంట చేయించడంలోనూ చింతమనేనికి నాయకత్వం తక్కువేం కాదు" అని కార్యకర్తలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. మహానాడు వేదికపై రాజకీయ పరిణామాల కన్నా ఎక్కువగా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.. "ఘాటు ఆవకాయ ఎప్పుడు వడ్డిస్తారో!"

**ఈ సారి కడప మహానాడులో రాజకీయ నేతలకన్నా గోదావరి ఆవకాయే ప్రత్యేక ఆకర్షణగా మారనుంది!**

## మహానాడుకు తరలిన మైలవరం టీడీపీ కుటుంబం

**కాన్వాయ్ ప్రారంభించిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు**





**ఇబ్రహీంపట్నం, మే 26 (జనస్వరం) :** కడపలో మంగళవారం నుంచి ఘనంగా జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి మైలవరం నియోజకవర్గం నుంచి టీడీపీ కుటుంబ సభ్యులు సోమవారం భారీగా తరలివెళ్లారు. ఈ మహానాడు కాన్వాయ్‌ను విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని టీడీపీ కార్యాలయం వద్ద మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ ఇంచార్జ్ వసంత వెంకట కృష్ణప్రసాదు పార్టీ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు "జోహార్ అన్న ఎన్టీఆర్", "జిందాబాద్ తెలుగుదేశం పార్టీ", "వర్ధిల్లాలి చంద్రబాబు నాయకత్వం", "వికసించాలి లోకేష్ నాయకత్వం" వంటి నినాదాలతో హోరెత్తించారు. అనంతరం ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ "తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని పరిరక్షించేందుకు అన్న ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ, అద్భుతమైన విజయాలతో తెలుగు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచింది. ఆ మహానేత ఆవిర్భావానికి కొనసాగింపుగా, ఈ రోజు చంద్రబాబు నేతృత్వంలో పార్టీ తిరుగులేని శక్తిగా మారింది. పేదల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూడు, గుడ్డ, నీడ కల్పించాలన్న ధ్యేయంతో స్థాపితమైన ఈ పార్టీ, చంద్రబాబు నాయుడు పాలనలో ఎన్నో సంస్కరణలు చేపట్టి రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తోంది," అని వివరించారు. ఈ మహానాడు కాన్వాయ్‌లో మైలవరం నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనడం గమనార్హం. వీరందరికీ ఎమ్మెల్యే కృష్ణప్రసాదు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానం గల ప్రజలు పాల్గొన్నారు. మహానాడులో పార్టీ దిశానిర్దేశానికి ఈ తరలిక బలంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

## బయలుకించంగి వద్ద రోడ్డు ప్రమాదం

**ఒకరికి కాలు విరగగా.. మరొకరికి స్వల్ప గాయాలు**

**చింతపల్లి, మే 26 (జనస్వరం) :** మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని బయలుకించంగి గ్రామ సమీపంలో సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల ప్రకారం, పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ (నడింవాడ) గుండాలగరువు గ్రామానికి చెందిన తెరవాడ బాబురావు, ఆయన భార్య పుష్పవతి ద్విచక్రవాహనంపై చింతపల్లి గ్రామంలో జరిగే శుభకార్యానికి వెళ్తుండగా, బయలుకించంగి వద్ద ఓ వ్యక్తి టి. బోజ్జయ్య ఆటో నుంచి దిగిన సమయంలో వీధి దాటుతున్న ఆయనను గమనించలేక బైకు అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బోజ్జయ్య కాలు విరగగా, బాబురావుకు స్వల్ప గాయాలైయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108కి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వైద్య సిబ్బంది గాయపడిన వారిని చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం కాలి గాయంతో బాధపడిన వ్యక్తిని మెరుగైన చికిత్స కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. స్థానికులు వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సూచిస్తున్నారు.

## డ్వాక్రా మహిళలకు వ్యాసరచన పోటీలు



**యలమంచిలి, మే 26 (జనస్వరం) :** అహల్యాబాయ్ హెరీల్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక మున్సిపాలిటీ డ్వాక్రా మహిళలకు అహల్యాబాయ్ హెరీల్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమా కుమారి మాట్లాడుతూ ఈ పోటీల్లో మొదటి బహుమతిగా మంగళగిరి చేనేత చీర అందిస్తామని, అలాగే 10 మందికి ప్రోత్సాహక బహుమతులు ఉంటాయన్నారు. ఈ బహుమతులు ఈ నెల 31న అహల్యాబాయ్ హెరీల్కర్ జన్మదిన వేడుకల్లో పెద్దల చేతుల మీదుగా అందిస్తామన్నారు. ఈ వ్యాసరచన పోటీల్లో 65 మంది మహిళలు పాల్గొనగా, న్యాయ నిర్ణేతులుగా డిగ్రీ కళాశాల రిటైర్డ్ వైస్ ప్రిన్సిపల్ ఏపీ జగన్నాథం, కొటారు శ్రీను మాస్టారు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మల్ల కొండబాబు, ఊటకూటి రమేష్, నక్క శివశంకర్, మనీషా బేగం, మెప్మా ప్రాజెక్ట్ అధికారి పద్మావతి, ఆర్‌పిలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంజన్న సేవలో మంత్రి అచ్చెన్నాయుడు



**పులివెందుల, మే 26 (జనస్వరం) :** నియోజకవర్గంలోని చక్రాయపేట మండలం పంచాయతీ పరిధిలో వెలసిన గండి క్షేత్రంలో సోమవారం మంత్రి అచ్చెన్నాయుడు వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 27, 28, 29వ తేదీలలో కడపలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి విచ్చేసిన ఆయన గండి క్షేత్రంలో వీరాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన మంత్రికి వేంపల్లి తెలుగుదేశం పార్టీ మండల టీడీపీ నాయకులు పార్టీ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్ఎండి షబ్బీర్, జిల్లా ఉపాధ్యక్షుడు నందిపల్లి రామగంగి రెడ్డి, గోటూరు నాగభూషణం, మహబూబ్ షరీఫ్, శివయ్య, టీడీపీ యూత్ వేణుగోపాల్ రెడ్డి గంగాధర్ రెడ్డి భాస్కర్‌లు ఘన స్వాగతం పలికారు.

## ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం

**- దైవారాధనతో మానసిక ఒత్తిడి దూరం**

**- దేవాలయాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలి**

**- గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు, మే 26 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** కాలానుగుణంగా మారిన దైనందిన జీవితంలో ప్రజలు ఆందోళనకర స్థాయిలో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఈ ఒత్తిడి నుంచి బయటపడాలంటే నిత్య దైవారాధాన ఒక్కటే మార్గమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. హనుమజ్జయంతి మహోత్సవాల్లో భాగంగా శ్రీనివాసరావు తోటలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం కొనసాగించవచ్చన్నారు. దేవాలయాల అభివృద్ధికి దాతలు మరింతగా ముందుకు రావాలని కోరారు. సమస్యాత్మక ప్రాంతమైన శ్రీనివాసరావుతోట చుట్టుపక్కల ప్రాంతాల్లో దైవ చింతన పెంపొందేలా కృషి చేస్తున్న ఆలయ కమిటీ వారిని మాధవి అభినందించారు. తొలుత మాధవి కి ఆలయ పూజారి కోగంటి పవన్ కుమార్, మహిళా భక్తులు ఘన స్వాగతం పలికారు. మహోత్సవాల్లో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు పుప్పాల నాగయ్య, నారదాసు కోటేశ్వరరావు, పత్తి కొండలు, శివ నాగేశ్వరావు, నరసింహారావు, తోట శంకరరావు, రాసంశెట్టి బుజ్జి, రాయల్, కోటేశ్వరరావు, ఆంజనేయులు, మోహన్ దాస్, కనక మహాలక్ష్మి, కేశవదాసు, పాలకాయల శివ, ఆళ్ళ హరి, రాజేశ్వరి, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## కడపలో తొలిసారిగా టీడీపీ రాష్ట్రమహానాడు

**- పెద్ద ఎత్తున తరలి రండి**

**- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి నియోజకవర్గ కార్యకర్తలకు పిలుపు**

**కడప, మే 26 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో తొలిసారిగా జరగబోయే టీడీపీ రాష్ట్ర మహానాడు పండుగకు పుట్టపర్తి నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర మహానాడుకు అవసరమైన వాహనాల ఏర్పాట్ల కోసం నియోజకవర్గంలోని మండల నాయకులు, కార్యకర్తలతో మాజీ మంత్రి ప్రత్యేకంగా చర్చించారు. నియోజకవర్గం నుంచి లక్షలాది కార్యకర్తలు ఈ మహానాడుకు హాజరవనున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి మహానాడు పండుగను ఘనంగా జరుపుకుంటున్నట్టు వారు తెలిపారు. రాయలసీమలోని కడపలో నిర్వహిస్తున్న ఈ మహానాడు అత్యంత ఘనంగా జరుగుతుందని, చివరి రోజు 29న భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, నల్లమాడ, ఓడి చెరువు, అమడగూరు, పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో వాహనాలు, భోజనం, నీరు, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొనే కార్యకర్తలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా చేరుకోవాలని సూచించారు. అనంతపురం నుంచి 26 తేదీ సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో పాటు ఇతర సీనియర్ నాయకులు కడప మహానాడుకు వెళ్లారు.

# టవర్ పక్కనే ఉన్నా.. సిగ్నల్ లేదు

**- రీఛార్జ్‌ల మోతతో నడ్డి విరుస్తున్న టెలికాం సంస్థలు**

**- సెల్ సిగ్నల్ లేకపోయినా రీఛార్జ్ తప్పదు..**

**- బెన్నవరం పంచాయతీ ప్రజలు ఆవేదన**



**చింతపల్లి, మే 26 (జనస్వరం) :** ప్రజల అలసత్వాన్ని ఆసరాగా చేసుకున్న కొన్ని ప్రైవేట్ రంగ సంస్థలు రీఛార్జీల మోతతో ప్రజల నడ్డి విరుస్తున్నాయని బెన్నవరం గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ కార్డుకు పోన్ నంబర్ లింకు, బ్యాంకు ఖాతాకు పోన్ నంబర్ లింకు వంటి పలు నిబంధనలు ఉండటం వలన అవసరమున్నా.. లేకున్నా, సెల్ సిగ్నల్ ఉన్నా... లేకున్నా ప్రతీ కుటుంబానికి సెల్ ఫోన్ తప్పనిసరి అయిందని వారన్నారు. ఈ నిబంధనల వలన నేడు పేద, మధ్యతరగతి అనే బేధం లేకుండా అందరూ తమ స్థాయికి తగిన సెల్ ఫోన్లు కొనుక్కొని నెలనెలా రీఛార్జ్ చేసుకొంటున్నారన్నారు. ప్రజల అలసత్వాన్ని ఆసరాగా చేసుకున్న కొన్ని ప్రైవేట్ రంగ సంస్థలు రీఛార్జీల పేరుతో ప్రజల నడ్డి విరచడమే గాక ప్రతిఫలానికి తగిన సేవలు అందించడంలో విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి ఆనుకొని ఉన్న పోతురాజుగుమ్మలు గ్రామంలో జియో టవర్ నిర్మించడంతో తమ గ్రామ ప్రజలంతా ఎంతో సంతోషించి జియో సిమ్‌లు కొనుక్కొన్నారని, కానీ పోతురాజుగుమ్మలు గ్రామం నుండి వచ్చే సెల్ సంకేతాలు తమకు అందడం లేదని వారన్నారు. అంతే గాక తమ గ్రామానికి బిఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, జియో వంటి ఏ రకమైన సెల్ సంకేతాలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వ ప్రైవేటు రంగాల ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలో సెల్ సంకేతాలు అందేలా చొరవ తీసుకోవాలని, కాని పక్షంలో ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వంటి పలు రకాల ప్రభుత్వ సేవలకు పోన్ నంబర్ లింకు నిబంధనైనా తొలగించే విధంగా చొరవ తీసుకోవాలని వారన్నారు. పోన్ నంబర్ లింకు నిబంధన లేకపోతే కొంతమందికైనా రీఛార్జీల మోత నుండి ఉపసమనం లభిస్తుందని వారన్నారు.

## కోనసీమలో విషాదం..

**- గోదావరిలో గల్లంతైన ఎనిమిది మంది యువకులు**

**- సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం**

**కోనసీమ, మే 26 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కమినిలంక సమీపంలోని గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన ఎనిమిది మంది యువకులు గల్లంతయ్యారు. శేరులంక గ్రామంలో జరిగిన శుభకార్యానికి హాజరైన యువకులు స్నానానికి వెళ్లిన సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కె.గంగవరం మండలం శేరులంక గ్రామంలో ఓ కుటుంబం నిర్వహించిన శుభకార్యానికి కాకినాడ, రామచంద్రపురం, మండపేట ప్రాంతాల నుంచి పలు కుటుంబాలు విచ్చేశాయి. ఈ క్రమంలో, 11 మంది యువకులు సమీపంలోని గోదావరిలో స్నానానికి వెళ్లారు. అయితే వీరిలో ఎనిమిది మంది గల్లంతయ్యారు. గల్లంతైనవారిలో కాకినాడకు చెందిన క్రాంతి (20), పాల్ (18), సాయి (18), సతీష్ (19), ఐ.పోలవరం మండలం ఎర్రగరువు గ్రామానికి చెందిన మహేష్, రాజేష్ (13), మండపేటకు చెందిన రోహిత్, శేరులంకకు చెందిన మహేష్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నప్పటికీ వారి ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదు. ఘటనపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గల్లంతైన యువకుల విషయమై జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఆయన, వెంటనే గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. గల్లంతైన వారి కుటుంబాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించిన సీఎం, సహాయక చర్యల్లో ఎలాంటి కోత లేకుండా చూసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందన్న హామీతో, తగినన్ని సహాయక బృందాలు, అవసరమైన వనరులు రంగంలోకి దించబడ్డాయని కలెక్టర్ సీఎంకు వివరించారు. ఈ విషాద ఘటన కోనసీమ జిల్లా ప్రజలను తీవ్రంగా కలచివేసింది.

## సీసీఆర్‌సీ కార్డుల లక్ష్యాన్ని సాధిస్తాం

**- అన్నదాత సుఖీభవ పదకం కింద 4,03,093 రికార్డులు పరిశీలన లక్ష్యంకాగా ఇంతవరకు 3,60,731 రైతుల వివరాలు పరిశీలన**

**- వ్యవసాయశాఖ, రెవిన్యూ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్**



**ఏలూరు, మే 26 (జనస్వరం) :** జిల్లాలో పంట సాగుదారు హక్కుల పత్రం (సీసీఆర్‌సీ), అన్నదాత సుఖీభవ పథకాల నిర్ధేశించిన లక్ష్యాలను నిర్ధిష్ట సమయంలో సాధిస్తూ జిల్లాని ముందుకు తీసుకెళ్లేం దుకు కృషిచేస్తామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్, రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయ లక్ష్మి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులతో వెబ్ ఎక్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఆర్‌సీ కార్డులు, అన్నదాత సుఖీభవ పథకాలపై సమీక్షించారు. ఈ పథకాల నిర్ధేశించిన లక్ష్యాల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల గుర్తింపు, నమోదులో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని పరిష్కరించుకుని నిర్ధేశించిన లక్ష్యాలు సాధించేందుకు తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గాను జిల్లాలో 75 వేల సీసీఆర్‌సీ కార్డులు మంజూరు లక్ష్యంగా నిర్ధేశించారన్నారు. వాటిని నిర్దేశించిన సమయంలో లక్ష్యాలను పూర్తి చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పదకం కింద 4,03,093 రికార్డులు పరిశీలన లక్ష్యంకాగా ఇంతవరకు 3,60,731 రైతుల వివరాలు పరిశీలన పూర్తయిందన్నారు. లక్ష్యసాధనకు సంబంధిత శాఖలకు దిశా నిర్దేశం చేస్తూ సమన్వయంతో లక్ష్యాలు సాధిస్తామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి సందర్భంగా కొవ్వలిలో భారీ అన్న సమారాధన



**దెందులూరు, మే 26 (జనస్వరం) :** మండలంలోని కొవ్వలి గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ సమీపంలో వేంచేసియున్న శ్రీ భక్తాంజనేయ స్వామివారి ఆలయంలో ఐదు రోజులుగా హనుమాన్ జయంతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజు గ్రామస్తులు, గ్రామ నాయకులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారికి పూజలు చేసి పూల మాలలు అర్పించి ప్రసాదాన్ని సమర్పించారు, శ్రీ భక్తాంజనేయ ఆలయ కమిటీ వారు కొవ్వలి గ్రామస్తులు అందర్నీ కూడా ఆయురారోగ్యాలు ఐశ్వర్యాలతో కాపాడాలని శ్రీ భక్తాంజనేయ స్వామి వారిని కోరుకున్నారు. తదానంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## తమిళనాడు సీఎం స్టాలిన్‌ను చూసి నేర్చుకోండి

**ఏపీ సీఎంకి హితువు పలికిన ఆర్పీఐ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్ కే మాబు**



**నెల్లూరు, మే 26 (జనస్వరం) :** రాష్ట్రంలో ఎండీయూ వ్యవస్థ రేషన్ సప్లై చేసే వాహనాలను ఆపివేయడాన్ని వ్యతిరేకిస్తూ నగరంలోని బోసుబొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు ఆర్పీఐ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆ ర్యాలీలో పాల్గొన్న ఆర్పీఐ పార్టీ జిల్లా అధ్యక్షులు. ఎస్ కే.మాబు, ఎండీయూ నేతలు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్.కె మాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు ఎండీయూ వ్యవస్థ ఇంటింటికి రేషన్ సప్లై చేసే వాహనాలను నిలిపివేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల నిరుపేదలు, ముసలి, ముతక వారు చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. రేషన్ సప్లై చేసే వాహనదారుల 18500 కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, రేషన్ వాహనదారులకు 2027 వరకు ఇచ్చిన అగ్రిమెంటును యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే.. పేదలకు రేషన్ సప్లై చేసే వాహనదారుల 18500 కుటుంబాలకు రాష్ట్రవ్యాప్తంగా అండగా నిలబడి పెద్ద ఎత్తున ఆర్పీఐ పార్టీ పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టపు రంగారావు, ఉపాధ్యక్షులు కొత్తల మధుసూదన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నంబూరు గణేష్, కోవూరు సురేష్, ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు దక్కా చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ అనారోగ్యం.. గుంటూరు జీజీహెచ్‌కు వల్లభనేని వంశీ






**గుంటూరు, మే 26 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** నకిలీ ఇళ్ల పట్టాల కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నేత వల్లభనేని వంశీ మళ్లీ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి (జీజీహెచ్)కు తరలించబడ్డారు. గత కొన్ని రోజులుగా శ్వాసకోశ సమస్యలతో వంశీ ఇబ్బంది పడుతున్నారు. కోర్టు హాజరుల సమయంలోనూ ఆయన తీవ్ర నీరసం, అస్వస్థతతో కనిపించారని సమాచారం. తాజాగా, జైలు కస్టడీలో ఉండగా వంశీ ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారి.. శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది ఎదురవడంతో కంపిపాడు ప్రభుత్వ ఆస్పత్రికి అత్యవసరంగా తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఆయనను గుంటూరు జీజీహెచ్‌కు మార్చి పోలీసులు చికిత్స అందజేస్తున్నారు. ఇప్పటికే విజయవాడ ప్రభుత్వాస్పత్రిలోనూ ఆయనకు శ్వాసకోశ సమస్యలపై చికిత్సలు నిర్వహించారు. అయితే సమస్యలు కొనసాగుతుండటంతో మళ్లీ జీజీహెచ్‌కు తరలించాల్సి వచ్చింది. న్యాయాధికారికి తన ఆరోగ్య సమస్యలను వంశీ వ్యక్తపరచడంతో, తగిన వైద్యం అందించాలంటూ కోర్టు పోలీసులు, జైలు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఇటీవల వంశీ ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీజీహెచ్ వైద్యుల పర్యవేక్షణలో ఆయనకు ప్రస్తుతానికి చికిత్స కొనసాగుతోంది.

## కడప మహానాడు ఏర్పాట్లపై నేతలతో ఎంపీ వేమిరెడ్డి సమీక్ష



**నెల్లూరు/కడప, మే 26 (జనస్వరం) :** తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కడపలో జరగబోయే మహానాడు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు మరియు మహానాడు సమన్వయ కమిటీ, ఆర్థిక కమిటీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం కడపలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, మంత్రి మండిపల్లి రాంప్రసాద్, విజయభాస్కర్ రెడ్డి, నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, ఇతర ప్రముఖ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కల్పించాల్సిన వసతులు, భద్రతా ఏర్పాట్లు, వసతి, రవాణా వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా నెల్లూరు నుంచి పెద్ద సంఖ్య లో వచ్చే కార్యకర్తల కోసం తీసుకోవాల్సిన ప్రత్యేక ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముం దస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని నేతలు నిర్ణయించారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో ప్రత్యేకంగా భేటీ అయి మహానాడు ఏర్పాట్ల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.

## కాకాణి గోవర్ధన్ రెడ్డికి 14 రోజుల రిమాండ్

**నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలింపు**



**నెల్లూరు, మే 26 (జనస్వరం) :** క్వార్ట్జ్ అక్రమాల కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని వెంకటగిరి కోర్టు 14 రోజుల రిమాండ్‌కు ఆమోదించింది. ఈ కేసులో 'ఏ4' నేరానికి సంబంధించిన వ్యక్తిగా కాకాణి గోవర్ధన్ రెడ్డిని బెంగళూరు సమీపంలో పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి సోమవారం నెల్లూరు జిల్లా వెంకటగిరి కోర్టులో హాజరు పరిచారు. వైద్య పరీక్షలు పూర్తయిన అనంతరం, వాదనలు వినిన జడ్జి లంచ్ విరామం తర్వాత 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆయనను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించేందుకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కేసులో కాకాణి గోవర్ధన్ రెడ్డిపై క్వార్ట్జ్ అక్రమాలు, భారీ పేలుళ్ల పదార్థాల వినియోగం, అట్రాసిటీ కేసు వంటి విషయంలో దర్యాప్తు జరుగుతోంది. పోలీసులు కాకాణిని కోర్టుకి తీసుకువస్తున్న సందర్భంగా, ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేశారు. కాగా, ఈ కేసుకు సంబంధించి గత రెండు నెలలుగా కాకాణి రెడ్డి పోలీసులు గాలింపు చర్యల నుండి తప్పించుకుంటూ ఉన్నట్లు తెలుస్తోంది. మూడు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ ఆయన విచారణకు హాజరుకాలేదు. ఇకపై, కేసు విచారణ కోసం అధికారులు కాకాణి గోవర్ధన్ రెడ్డిని కస్టడీకి కోరే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## పీబీసీపై పూడికతీత పనులను ప్రారంభం

**- రూ.9.49 లక్షలతో కాలువ పూడిక తీత**

**- పాల్గొన్న జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సునీల్ కుమార్**





**పిఠాపురం, మే 26 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** మండలంలోని పిఠాపురం బ్రాంచి కెనాల్ పై క్లోజర్ పనులు జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు, గోదావరి ఇస్టన్ డెల్టా కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్ ఆదివారం ప్రారంభించారు. చిత్రాడ గోదావరి కాలువ 9 ఆర్ పై కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభించిన ఈ కార్యక్రమంలో నాయకులు రైతుల పంటలకు సాగునీరు ఇబ్బంది కలగకుండా తొలకరి సమయాల్లో కాలువల్లో పూడిక, గుర్రపు డెక్కలను తొలగిస్తామని తెలిపారు. ఈ పూడికతీత పనుల కోసం సుమారు రూ. 9.49 లక్షల బడ్జెట్ ఏర్పాటు చేయగా, 9 ఆర్ కాలువపై మొత్తం రూ. 19.49 లక్షలతో వివిధ పనులు ప్రారంభించబడ్డాయని తెలిపారు. రైతులు ఈ పనులను స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ టీసీలు ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, గోదావరి ఇస్టన్ డెల్టా చైర్మన్ మురాలశెట్టి సునీల్ కి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరఫున రైతుల తరుపున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సభలో నేటి సంఘ అధ్యక్షులు బస్వా నాగశత్తులు, ఏలేరు ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ వూటా ఆదివిష్ణు, ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, పిఠాపురం మార్కెట్ యాడ్ చైర్మన్ దేవి సూర్యప్రకాష్, సర్పంచ్ సునీత, నంద్యాల జాన్, పేర్ని డి వెంకట్రావు, కోన లోవరాజు, బావిశెట్టి నంది, బస్వా ఐ రాజు, బస్వా రాము, కోటిపల్లి గోవింద్, మేడేత్తు పెద్దిరాజు, పేర్ని డి పోలీస్, బస్వా చక్కెర రావు, నిమ్మన దుర్గ, నాయుడు మణికంఠ, పెంట వెంకటేష్, కోటిపల్లి కాశి విశ్వనాధ్, కండవల్లి రమణ, పిల్లా లవ రాజు, జోగా , రాజారావు, గంజి గోవిందరాజు, వినుకొండ అమ్మాజీ, పిల్ల దినేష్, కరణం వీరబాబు, జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## డివైడర్ దాటొచ్చి.. కారును ఢీకొట్టి..

**- రాజమండ్రి గామన్ వంతెన హైవేపై లారీ బీభత్సం**

**- నలుగురి దుర్మరణం.. ఒకరి పరిస్థితి విషమం**

**- మృతుల్లో ఇద్దరు వయో వృద్ధులు**

**- మనవరాలి పుట్టినరోజుకు కాకినాడకు వెళ్తుండగా ఘటన**



**రాజమహేంద్రవరం, మే 26 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** కాకినాడలో చదువుకుంటున్న మనవరాలి పుట్టినరోజు సందర్భంగా.. ఆమెను కలిసి ఆశీస్సులు అందించేందుకు ఆ తాతయ్య, అమ్మమ్మలు.. మరో ముగ్గురితో కలిసి కారులో బయలుదేరారు. అయితే, వీరు బయలుదేరిన పది నిమిషాలకే.. మృత్యువు బొగ్గు లారీ రూపంలో ఎదురొచ్చింది. రాజమండ్రి గామన్ బ్రిడ్జి హైవేపై లారీ అదుపుతప్పి డివైడర్‌ను దాటి.. పక్కరోడ్డులో ఎదురుగా వస్తున్న వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో నలుగురు మృతి చెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలివీ.. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలానికి చెందిన ఉప్పులూరి వరప్రసాద్(60) భార్య శివలీలావతి(56)తో కలిసి కొవ్వూరులో నివాసం ఉంటూ కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వీరి కుమార్తె భవానీ ఏడేళ్లక్రితం విద్యుదాఘాతంలో మరణించింది. భవానీకి కుమార్తె భువనేశ్వరి, కుమారుడు శంకర్ ఉన్నారు. కూతురి మరణంతో మనవళ్ల సంరక్షణ భారం వీరిపై పడింది. వీళ్ల భాగస్వామ్యంతోపాటు బంధుమిత్రుల సాయంతో ఇద్దరినీ చదివిస్తున్నారు. సోమవారం భువనేశ్వరి పుట్టినరోజు. కాకినాడలో చదువుకుంటోన్న ఆమె వద్దకు ఉదయం 9 గంటల సమయంలో కొవ్వూరు నుంచి కారులో బయలుదేరారు. ఆమెకు ఇష్టమైన తినుబండారాలు సిద్ధం చేసుకుని పెట్టుకున్నారు. కారులో వరప్రసాద్ దంపతులతోపాటు పక్కింటివారైన.. చాగల్లు మండలానికి చెందిన లక్కంసాని సురేశ్(అవంతి ఫీడ్స్ ఉద్యోగి), బిందు(34) దంపతులు, చాగల్లు మండలం మార్కొండపాడుకు చెందిన శివలీలావతి తల్లి ఉప్పులూరి వీరవెంకట సత్యవతి (75) ఉన్నారు. వరప్రసాద్ కారు డ్రైవింగ్‌లో ఉన్నాడు. గామన్ వంతెన హైవే రోడ్డులో ఎడమవైపు లైన్‌లో ఆటోనగర్ జంక్షన్ దగ్గర్లోకి వచ్చారు. పక్కనే కుడివైపు రోడ్డులో దివాన్‌చెరువు వైపునుంచి వచ్చే వాహనాలను ఆటోనగర్ జంక్షన్‌వద్ద రోడ్డు రవాణా అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో బొగ్గు లోడుతో విశాఖ నుంచి మహారాష్ట్ర వెళ్తున్న లారీ వస్తోంది. వాహనాల తనిఖీలు గమనించిన లారీ డ్రైవర్ కంగారులో సడెన్ బ్రేక్ వేశాడు. వాహనంలో 30 టన్నులకుపైగా బొగ్గు లోడు ఉండడంతో వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో లారీ డివైడరును దాటి అవతలి లైన్‌లో వస్తున్న కారును ఢీకొట్టి పది మీటర్ల మేర నెట్టుకుపోయింది. చిన్న చెట్టు అడ్డు రావడంతో చెట్టుకు లారీకి మధ్య కారు నలిగిపోయింది. దీంతో కారులో ఉన్న వరప్రసాద్, సత్యవతి, బిందు ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. లీలావతి ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికి మరణించగా.. సురేశ్ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంపై రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.